www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 14 | సెప్టెంబర్ | 2025 పేజీలు : 7

## పెదవాగు వరద ఉధృతికి ఇద్దరు మహిళలు గల్లంతు

- రాచన్నగూడెం చినవాగు వద్ద చిక్కుకున్న పోలీసులు
- పూచికపాడు గ్రామంలో తీవ్ర విషాదం

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** వ్యవసాయ పనికి వెళ్లిన మహిళా కూలీలు తెప్ప రూపంలో మృత్యువు వెంటాడింది. వాగు దాటుతుండగా ఇద్దరు మహిళలు గల్లంతు కాగా మరో 7గురు మహిళలు బయటపడ్డారు. సంఘటనాస్థలానికి బయలుదేరిన ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు మండలాల పోలీసులు మార్గం మధ్యలో వాగు వద్ద చిక్కుకుపోయారు. గ్రామస్తులు గల్లంతైన మహిళల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కావడిగుండ్ల గ్రామానికి చెందిన రైతు పోతన కోటేశ్వరరావు పత్తి పొలంలో కలుపు తీసేందుకు ఆయన భార్య శ్రీలక్ష్మి, కుమారుడు సురేష్‌లు స్థానిక మహిళా కూలీ లావణ్యతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం పూచికపాడు గ్రామానికి చెందిన పాలగుడుల చెన్నమ్మ(48), పచ్చిశాల వరలక్ష్మి (49)తాండ్ర సత్యావతి, దుక్కిపాటి మాలశ్రీ, తోటికోడళ్లు రామినేని రమణమ్మ, లక్ష్మిలను శనివారం తీసుకెళ్లారు. పత్తి చేనులో కలుపు తీస్తుండగా మధ్యాహ్నం 1.30గంటలకు వర్షం మొదలైంది. దీంతో కూలీలంతా ఇంటికి వెళ్లేందుకు బయలుదేరారు. సమీపంలోని పెద వాగు కాలువలో నుండి వస్తుండగా ఒక్కసారిగా వరద తెప్ప వచ్చి పడింది. మిగతా 2లో..

# శ్రామిక పీడిత జనస్వరం సురవరం




- సుధాకర్‌రెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు : కూనంనేని
- ఉద్యమ గొంతుక మూగబోయింది
- సంస్మరణ సభలో వక్తలు
- సుధాకర్‌రెడ్డికి ఘన నివాళి












**ప్రజాపక్షం/ ఖమ్మం :** 60 సంవత్సరాల ప్రజా జీవితంలో సురవరం శ్రామిక, పీడిత జన గొంతుకగా పనిచేశారని ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు తెలిపారు. ప్రజ ల కోసం తుదిశ్వాస వరకు పోరాడిన ఒక నికార్సయిన కమ్యూనిస్టుగా సుధాకర్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయారని ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకుడు, మాజీ ఎంపి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ శనివారం స్థానిక భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగింది. సభకు ముందు సురవరం చిత్ర పటానికి వివిధ రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, అభ్యుదయ వాదులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రజా ఉద్యమ గొంతుకగా సుధాకర్ రెడ్డి పనిచేశారని ఆయన మరణం యావత్ మిగతా 2లో..

## నిజాం ప్రభుత్వాన్ని కూల్చిన ఘనత కమ్యూనిస్టులదే..



- సాయుధ పోరాటం దేశానికి దిక్సూచి
- సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా
- సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా సాయుధ పోరాట వారోత్సవాలు

**ప్రజాపక్షం/పాల్వంచ :** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టి నిజాం ప్రభుత్వాన్ని కూలగొట్టిన ఘనత కమ్యూనిస్టులదే అని, మట్టి మనుషులను పోరాట యోధులుగా మార్చింది ఎర్రజెండాయేనని, కమ్యూనిస్టులతో మమేకమట నాటి మట్టి మనుషులు సాగించిన మిగతా 2లో..

## సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజాఉద్యమాలు చేపట్టాలి



- సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం

**ప్రజాపక్షం/చింతకాని :** నైజాం నిరంకుశపాలన అంతం కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిగా ప్రభుత్వ వ్యతిరేక ప్రజా ఉద్యమాలు చేపట్టాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు పిలుపునిచ్చారు. చింతకాని మండలం ప్రొద్దుటూరులో తెలంగాణ సాయుధ పోరాట యోధులు తాళ్ళపల్లి రాములు స్థూపం వద్ద వారోత్సవాల్ని ఆయన ప్రారంభించారు. తొలత జెండా ఆవిష్కరించిన భాగం అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం మిగతా 2లో..

# శ్రామిక పీడిత జనస్వరం సురవరం









(మొదటిపేజీ తరువాయి)
కమ్యూనిస్టు ఉద్యమానికి, పేద ప్రజలకు తీరని లోటన్నారు. ప్రజల కోసమే జీవించిన ఆయన ఎందరికో ఆదర్శమని ఆయన జీవితం ఓ చరిత్ర అయితే ఆయన మరణం ఒక చారిత్రిక ఘట్టమని ఆయన తెలిపారు. జననం, మరణం సహజమే అయినా జీవించి ఉన్న కాలంలో ఎవరి పక్షాన పని చేశాం ఎవరి కోసం పనిచేశామన్నది ప్రధానమని ప్రజల కోసం సామాజిక చైతన్యం కోసం పని చేసి మరణించిన వారు ప్రజల హృదయాలలో జీవించి ఉంటారన్నారు. మతానికి, సైన్స్‌కు ప్రాంతీయ బేధం లేనట్లే కమ్యూనిజానికి ప్రాంతీయత లేదన్నారు. కమ్యూనిజం ఒక చారిత్రిక అవసరమైందని విడిపోయి బలహీనపడిన మళ్లీ ఐక్యతతో బలపడతామని కూనంనేని పిలుపునిచ్చారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లోనూ లక్షలాది మంది కమ్యూనిస్టు అభిమానులు ఉన్నారని అలాగే సమాజంలో అట్టడుగు వర్గాల్లో సైతం కమ్యూనిస్టుల పట్ల ఆదరణ తగ్గలేదని ఆయన తెలిపారు. వీరందరిని ఏకతాటిపైకి తెచ్చి కార్యోన్ముఖులను చేయడమే సుధాకర్‌రెడ్డి లాంటి అమరులకు మనమిచ్చే నివాళి అన్నారు. చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య, సీతారాం ఏచూరి, సురవరం సుధాకర్‌రెడ్డి లాంటి వారు నిబద్ధతకు, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని వారు చూపిన బాట ఆదర్శనీయమన్నారు. వంద సంవత్సరాల కమ్యూనిస్టు ఉద్యమ ఘట్టాన్ని నేటి తరానికి వివరిస్తూ భవిష్యత్తులో బలమైన ప్రజా ఉద్యమ నిర్మాణాల కోసం డిసెంబర్ 26న ఖమ్మంలో శత వసంత ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు కూనంనేని తెలిపారు. లక్షలాది మందితో ఖమ్మం నగరం ఎరుపెక్కనుందని మరో చారిత్రిక ఘట్టానికి ఖమ్మం వేదిక కానుందని కూనంనేని తెలిపారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ లాంటి




మతశక్తులు చరిత్రహీనులు తమ ఫాసిస్టు విధానాలతో ప్రజలను వంచిస్తున్నారని ఆరోపించారు. గాంధీని, గాడ్సేను కొలుస్తారని ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించిన వల్లభాయి పటేల్‌ను అలాగే గోవాల్కర్‌ను కొలుస్తారని ఆయన తెలిపారు. కమ్యూనిస్టు సిద్ధాంతం అజేయమైంది కాబట్టే బిజెపి కమ్యూనిస్టులను తమ శత్రువులుగా చూస్తుందని ఆయన తెలిపారు.

### కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు : సుదర్శన్

సురవరం సుధాకర్‌రెడ్డి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ తెలిపారు. విద్యార్థి దశ నుంచి తనదైన శైలిలో పోరాటాలను నడిపిన సురవరం ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. సీతారాం ఏచూరి, సురవరం సుధాకర్‌రెడ్డి 40 దేశాల్లో పర్యటించి కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి కృషి చేశారన్నారు. విద్యుత్ పోరాటంలో సురవరం, బివి రాఘవులు లాంటి వారు ముందుండి ఒక చారిత్రిక ఉద్యమాన్ని నడిపించారని సుదర్శన్ తెలిపారు. సుధాకర్‌రెడ్డి లాంటి వ్యక్తులు చట్ట సభలలో ఉండి పలు చట్టాలను తీసుకు రావడానికి కారణమయ్యారని ముఖ్యంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టాల వెనక కమ్యూనిస్టుల పాత్ర మరువలేనిది మరుపురానిదన్నారు. సభలో గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంత రావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సిసిఏ బాధ్యులు, ప్రముఖ వైద్యులు రవీంద్రనాథ్, సిపిఐ(ఎంఎల్)మాసల్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, టియుడబ్ల్యూజె (ఐజెయు)రాష్ట్ర కార్యదర్శి కె. రాంనారాయణ, టియుడబ్ల్యూజె (టిజెఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ తదితరులు ప్రసంగించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి ఆహుతులను వేదికపైకి ఆహ్వానించగా స్వర్శ అధ్యయన వేదిక బాధ్యులు స్పర్శ భాస్కర్, సిసిఏ బాధ్యులు రవిమారుత్, ఐఎఎల్ నాయకులు పోట్ల మాధవరావు, ప్రముఖ వైద్యులు వై. ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు వడ్డె నారాయణరావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, బిజి క్లెమెంట్, మహ్మద్ సలాం, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి తదితరులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజాఉద్యమాలు చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)
జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ నాటి మహత్తర పోరాటాన్ని బీజేపీ హైజాక్ చేసేందుకు యత్నిస్తుందని,రాచరికానికి నిర్బాంధానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని ముస్లీం రాజుపై హిందువులు చేసిన పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తుందన్నారు.సాయుధపోరాటంలో నిజాం రాజుకు వ్యతిరేకంగా పోరాడిన వారిలో అన్ని వర్గాల వారు ప్రాణత్యాగం చేశారని బీజేపీ, ఎంఐఎం గుర్తుంచుకోవాలన్నారు. కమ్యూనిస్టులు చేసిన వీరోచిత పోరాటలను తట్టుకోలేకే నైజాం రాజు హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిన సెప్టెంబర్ 17అని సాయుధపోరాటానికి పిలునిచ్చిన రోజని పేర్కొన్నారు. నాడు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో జమిందార్లు ,నిజాం నిరంకుశపాలనకు ఎదురొడ్డి సుమారు పదిలక్షల ఎకరాలు భూమిని పేదలకు పంచిన ఘనత కమ్యూనిస్టులదే అన్నారు. నిజాం నిరంకుశపాలనలో మాతృభాషలో విద్యాభోదన నిషేదం, వెట్టి



చాకిరి, నిరుద్యోగం, నిరక్ష్యరాస్యత, దారిద్ర్యం ప్రజలను పట్టి పీడించాయని, అలాంటి పరిస్థితులే ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్నాయన్నారు. సాయుధ పోరాట అమరులు ఆశించిన లక్ష్యాల సాధన దిశగా ప్రజా ఉద్యమాలకు సిద్దం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లిఖార్జునరావు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్,రైతు సంఘం మండల కార్యదర్శి పదిమల వెంకటనర్సయ్య,వ్యకాస జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పగిళ్లపల్లి ఏసు, నాయకులు తాళ్ళపల్లి అజయ్, పెంట్యాల చలమయ్య, వేల్పుల కోటయ్య, శాఖ కార్యదర్శి తుళ్లూరు శ్రీనువాసరావు,తుడుం గోపాలరావు, చేబ్రోలు ఇంద్రసేన,టీడీపీ నాయకులు పెంట్యాల రామారావు,బారాస నాయకులు పాపినేని రంగారావు, సీపీఎం నాయకులు పులి యజ్ఞనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పెదవాగు వరద ఉధృతికి

# ఇద్దరు మహిళలు గల్లంతు

(మొదటిపేజీ తరువాయి)
ఈ వరద ఉధృతికి చెన్నమ్మ, వరలక్ష్మి గల్లంతయ్యారు. వీరితో పాటు సురేష్ కూడా కాలువలో వరదనీటి నుండి స్వల్ప ప్రమాదంతో బయటకు వచ్చాడు. అప్పటికే మిగతా కూలీలు ఒడ్డున చేరుకున్న మరో ఆరుగురు ప్రాణాలను కాపాడుకున్నారు. ప్రాణ భయంతో కావడిగండ్ల, పూచికపాడు ప్రజలకు సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తమైన ఆయా గ్రామాల ప్రజలు భారీగా పెద వాగు వద్దకు చేరుకున్నారు. వాగు వరద ఉధృతి మరింత పెరగటంతో ఆందోళనకు గురయ్యారు. స్థానిక గ్రామ ప్రజల నుండి సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై యయాతి రాజు, జీలుగుమిల్లి సిఐ వెంకటేశ్వరరావు, ఎస్సై క్రాంతికుమార్‌లు సిబ్బందితో సంఘటనా ప్రదేశానికి బయలుదేరగా రాచన్నగూడెం సమీపంలో చినవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అక్కడే చిక్కుకున్నారు. వాగు దాటి ముందుకు వెళ్లే పరిస్థితులు లేక బాధిత గ్రామాల ప్రజల వద్ద నుండి ఇతర వివరాలు సేకరిస్తున్నారు. మహిళా కూలీలు గల్లంతు కావటంతో పూచికపాడు గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. వారి ఆచూకీ కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. గల్లంతైన మహిళల ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ యయాతి రాజు తెలిపారు.

# నిజాం ప్రభుత్వాన్ని కూల్చిన ఘనత కమ్యూనిస్టులదే..



(మొదటిపేజీ తరువాయి)
వీరోచిత పోరాట ఫలితమే నేటి ప్రజాస్వామ్య తెలంగాణ రాష్ట్రమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. ఈ నెల 11 నుండి 17 వరకు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో జరుగుతున్న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలలో భాగంగా సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో భారీ ప్రదర్శన చేపట్టారు. చంద్రా రాజేశ్వరరావు భవన్ నుండి సాగిన ప్రదర్శన అమరజీవులు వృషారావు, నాదెండ్ల రామకోటయ్య, ఉప్పుశెట్టి ఖాదర్‌బాబు స్మారక స్థూపాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి పాత ఆర్‌డిఓ కార్యాలయం రోడ్‌లో గల అమరవీరుల స్మారక స్థూపం వద్ద తెలంగాణ సాయుధ పోరాట నాయకులునల్లమల్ల గురుప్రసాద్, సిపిఐ మాజీ జిల్లా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్ది వెంకటేశ్వర్లు విగ్రహాలకు నివాళులర్పించి సిపిఐ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సాబీర్‌పాషా మాట్లాడుతూ తెలంగాణాలో జరిగిన సాయుధ పోరాటం నేటికి ప్రజలకు స్ఫూర్తినిస్తున్నదని దున్నేవాడికే భూమి నినాదం దేశ వ్యాప్తంగా చేసిందని కొనియాడారు. మహత్తరమైన, త్యాగపూరితమైన సాయుధ పోరాటన్ని మత పోరాటంగా చిత్రీకరిస్తూ నేటి ఆర్‌ఎస్‌ఎస్ వారసులుగా చలామని అవుతున్న బిజేపి లబ్ధిపొందే కుట్ర చేస్తోందని విమర్శించారు. నాడు రైతాంగ పోరాటంలో పంపిన భూముల్లో నేటి పాలకులు మూడో వంతు కూడా పంచలేదని ఆరోపించారు.నాటి సాయుధ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రజా పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

### సాయుధ పోరాటంలో బిజేపి పాత్ర లేదు : ముత్యాల

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో బిజేపి పాత్ర ఎంత మాత్రం లేదని, కానీ చరిత్రను వక్రీకరించి పోరాటాన్ని తామే చేసినట్లుగా చెప్పుకొనే




ప్రయత్నాలు చేస్తున్నదని సిపిఐ రాష్ట్ర సమితి సబ్యులు ముత్యాల విశ్వనాథం ఆరోపించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సబ్యులు ఉప్పుశెట్టి రాహుల్ అధ్యక్షన జరిగిన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సబ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా సమితి సబ్యులు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, వి. పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకటరావు, వర్క అజిత్, డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు డి. చెన్నయ్య, ప్రజా సంఘాల నాయకులు కొంగర అప్పారావు, జర్పుల మోహన్, ఉప్పుశెట్టి రాకేష్, గుండాల సుజన్, సత్యనారాయణ, ఎస్‌కే. కాసీం, ఎస్‌కే. కరీం, బదావత్ శ్రీను, జర్పుల బాలక్రిష్ణ, కిషన్, రామక్రిష్ణ, కమటం ఈశ్వరమ్మ, వడ్లకొండమేరమ్మ, వగ్గెల పద్మ, రాజేష్, శ్రీను, లాల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**-తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం**





**ప్రజాపక్షం/బోనకల్:** అకాల వర్షాలకు నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో దెబ్బతిన్న పత్తి పంటలను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ ఈ యేడాది అధిక వర్షాలు కురిసిన కారణంగా ఖమ్మం జిల్లాతో తెలంగాణలో అనేక ప్రాంతాల్లో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయిన పరిస్థితి నెలకొందని అన్నారు. పెట్టుబడులు పెట్టి పంట చేతికి వచ్చే సమయంలో అధిక వర్షాల వల్ల ఎకరానికి 15 క్వింటాల దిగుబడి రావాల్సి ఉండగా, కేవలం ఒక క్వింటా, రెండు క్వింటాల దిగుబడి మాత్రమే వచ్చే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తంగా వర్షాల వల్ల పత్తి ఏపుగా పెరిగి కాయలు కుళ్లిపోవడంతో రైతులు అయోమయ పరిస్థితిలో ఉన్నారని అన్నారు. ఒక వైపు కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని ఎత్తివేస్తూ రైతులను నష్టపరిచే పరిస్థితి దాపురించదని, తెలంగాణ రాష్ట్రంలో 18 లక్షల హెక్టార్ల పత్తి సాగు చేయబడిందని, రైతులంతా అప్పులపాలై తీవ్ర నష్టాల్లోకి వెళ్లారని అన్నారు. ప్రభుత్వం రైతులను అదుకోవాల్సి అవసరం ఎంతైనా ఉందని, తక్షణమే నష్టపోయిన పత్తి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని హేమంతరావు డిమాండ్ చేశారు. గోవిందాపురం(ఎల్)లో నూటికి తొంబై శాతం కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారని, ఈ ప్రాంతంలో కౌలు కూడా ముందే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పెట్టుబడులు, ఎరువులకు అప్పులు తెచ్చి వ్యవసాయం చెస్తే అకాల వర్షాలతో కౌలు రైతులకు తీవ్ర నష్టాల పాలయ్యారని అన్నారు. రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వమే తక్షణమే రైతులను, కౌలు రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జక్కుల రామారావు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, రైతులు పుచ్చకాయల తిరుపయ్య, గోళ్ల కన్నయ్య, చింతలచెర్వు మాధారయ్య, కౌలు రైతులు పాల్గొన్నారు.

# ఉత్తమ రాజ్యసభ సభ్యులు సీతారాం ఏచూరి



**ప్రజాపక్షం/వైరా:** సెక్యులర్, డెమోక్రసీ పాలన కోరుకున్న ఉత్తమ రాజ్యసభ సభ్యులు కమ్రేడ్ సీతారాం ఏచూరి అని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సిపిఎం వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బోడేపూడి భవనంలో సిపిఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి అమరజీవి సీతారాం ఏచూరి మొదటి వర్ధంతి సభ పార్టీ పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రానికి ముఖ్య అతిధిగా హాజరైన పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బొంతు రాంబాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి ఎస్‌ఎఫ్‌ఐలో అనేక పోరాటాలు నిర్వహించిన సీతారాం ఏచూరి అంచెలంచెలుగా ఎదిగి సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందడం జరిగిందని తెలిపారు. పార్టీలో విస్తృతంగా ప్రజా ఉద్యమాలను చేపడుతూ పార్లమెంటులో రాజ్యసభ సభ్యుడిగా ప్రజా సమస్యలపై దేశంలో మారుతున్న ఆర్థిక,సామాజిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా రాజ్యసభలో తాను చేసిన ఉపన్యాసాలు భారత ప్రజలు మరువలేనివని, నేటి ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా ఉత్తమ రాజ్యసభ గౌరవం దక్కించుకున్న గొప్ప మేధావి, ఆదర్శ నేత, ప్రజానాయకుడు సీతారాం ఏచూరి అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, మచ్చా మణి, డివిజన్ కమిటీ సభ్యులు తోట నాగేశ్వరరావు, నాయకులు పారుపల్లి కృష్ణారావు, పైడిపల్లి సాంబశివరావు, బొంతు సమత, కొంగర సుధాకర్, సంక్రాంతి సరసయ్య, అనుమోలు రామారావు, కామినేని రవి, తోట కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజమార్గం

**-ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం**
**జిల్లా ప్రధాన న్యాయమూర్తి**

**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** రాజీమార్గమే రాజమార్గమని రాజీ పడదగ్గ కేసుల్లో రాజీపడి సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ జి. రాజగోపాల్ తెలిపారు. శనివారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీతో ఇరు వర్గాలు గెలిచినట్లేనని లోక్ అదాలత్ తీర్పు సుప్రీం తీర్పుతో సమానమని తెలిపారు. లోక్ అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని త్వరితగతిన కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. రాజీ మార్గంలో లోక్ అదాలత్‌ల ద్వారా తమ కేసులను శాంతియుతంగా పరిష్కరించుకోవడం ద్వారా ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. ఎలాంటి ఫీజులు లేకుండా న్యాయసేవా సంస్థ సహకారంతో కేసులను పూర్తి చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా కోర్టు చుట్టూ తిరిగే పని ఉండదని సమయం ఆదా అవుతుందని న్యాయమూర్తి రాజగోపాల్ తెలిపారు. ఆరోగ్యకరమైన వివాద రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మొత్తం 4746 కేసులను గుర్తించి ఇప్పటికే 502 కేసులు పరిష్కరించగా గత లోక్ అదాలత్‌లో కొన్ని కేసులు పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుత లోక్ అదాలత్‌లో 597 కేసులు పరిష్కారం అవుతాయని తెలిపారు. వివిధ




రకాల కేసుల్లో రాజీ పడితే మంచిదని ఆయన కక్షిదారులకు సూచించారు. గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు ప్రసంగించగా పెద్దబోయిన మాధవి, పెద్దబోయిన లక్ష్మణ్ కేసులు పరిష్కరించి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మొక్కలను బహూకరించారు. కక్షిదారులకు భోజన సౌకర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు దేవినేని రాంప్రసాదరావు, చంద్రశేఖర్‌రావు, కల్పన, మురళిమోహన్, కాసరగడ్డ దీప, బెక్కం రజని, బిందుప్రియ, మాధవి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద బీమా చెక్కు అందజేత



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక బిసా కాలనీకి చెందిన మర్సకట్ల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి సమీపంలో ఉన్న స్టేట్ బ్యాక్ సోమవరం శాఖ నందు అకౌంట్ కలిగి ఉన్నాడు. ఏప్రిల్‌లో మరణించాడు. ఆయన ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా రూ.436లు కట్టి ఉండటం వలన ఆయనకు రూ.2లక్షల నగదు చెక్కును నామిని అయిన భార్య, కొడుకు సుమన్‌కి ఎస్‌బిఐ మేనేజర్ అందజేశారు. ఈ విధంగా ప్రతిఒక్కరూ ప్రధాన మంత్రి పథకాలను సభ్యులుగా చేరి పథకం వలన ప్రయోజనాలు పొందాలని స్థానిక బ్యాంక్ మేనేజర్ వేణు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది భరత్, బ్యాంకు మిత్ర రమేష్, వెంకటి, స్నేహ పాల్గొన్నారు.

# రోడ్డుకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తెల్దారుపల్లిలో రూ.4.2 కోట్ల విలువైన ఖమ్మం టూ కోదాడ ఆర్అండ్‌బి రోడ్డుకు కాంగ్రెస్ యువ నాయకుడు తమ్మినేని నవీన్ శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక కాంగ్రెస్ నాయకులు, తమ్మినేని కృష్ణయ్య అభిమానులతో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, తమ్మినేని కృష్ణయ్య అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు అనంతసాగర్‌లో మల్లు నందిని పర్యటన



**ప్రజాపక్షం/చింతకాని:** అమ్మా ఫౌండేషన్ చైర్మన్, డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందిని ఆదివారం చింతకాని మండలం అనంతసాగర్‌లో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలో బారాస నుంచి కార్యకర్తలంతా పెద్ద ఎత్తున ఆదివారం నందిని విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. శనివారం నూతలపాటి మధిర లో మల్లు నందిని విక్రమార్కని కలిసి కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చల్లా అచ్చయ్య పాల్గొన్నారు.

# ఓటమి భయంతోనే భట్టి ప్రలోభాలకు దిగాడు

**బారాస మధిర నియోజకవర్గ ఇంచార్జ్ లింగాల కమల్ రాజు**



**ప్రజాపక్షం/చింతకాని :** భట్టి విక్రమార్క అధికార మదంతో, ఓటమి భయంతో బిఆర్ఎస్ నాయకులను ప్రలోభాలకు గురిచేస్తున్నారని బారాస మధిర నియోజకవర్గ ఇంచార్జ్ లింగాల కమల్‌రాజు విమర్శించారు. శనివారం చింతకాని మండలకేంద్రంలో మాజీఎంపీపీ పొనుగోటి రత్నాకర్ నివాసంలో ఏర్పాటు చేసిన బారాస మండల ముఖ్య నాయకుల సమావేశంలో కమల్‌రాజు మాట్లాడుతూ భట్టి విక్రమార్క కమిషన్లతో వచ్చే డబ్బులతో ప్రలోభాలకు పాల్పడుతున్నారన్నారు.మధిర నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీని కదిలించడం భట్టీ తరం కాదని అన్నారు. కొందరు బ్రోకర్ల ను పెట్టుకుని భట్టీ చేస్తున్న చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. పోలీసులు , కొందరు అధికారులు బిఆర్ఎస్ నాయకులకు ఫోన్ చేసి కాంగ్రెస్ పార్టీ లో చేరాలని భయబ్రాంతులకు గురిచేస్తున్నారని తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నాయన్నారు. చింతకాని ఎస్సై పోలీస్ స్టేషన్ బోర్డు తొలగించి కాంగ్రెస్ కార్యాలయంగా పెట్టుకోవాలన్నారు. తమ నాయకులు కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని రాబోయే రోజుల్లో ఎక్కడ ఉన్నా వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీవైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు పార్టీ మండల కార్యదర్శి బొడ్డు వెంకటరామారావు, జిల్లా రైతు నాయకులు మంకెన రమేష్, మాజీ ఎంపీపీ పొనుగోటి రత్నాకర్, యువజన విభాగం అధ్యక్షుడు పిన్నెల్లి శ్రీను,మాజీ సర్పంచ్‌లు కన్నెబోయిన కుటుంబరావు, తిరుపతి కొండలు, చాట్ల సురేష్, సీనియర్ నాయకులు వంకాయలపాటి సత్యనారాయణ, వంకాయలపాటి లచ్చయ్య, వేముల నర్సయ్య, పర్చగాని ఏడుకొండలు, ఆళ్ల అజయ్, షబ్బీర్ ఖాన్, జలగబోయిన కృష్ణ. జానీమియా, షిలార్ సాహెబ్, మదార్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# స్ట్రక్చర్ సమావేశం బహిష్కరణ




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జేవిఆర్, కిష్టారం ఓసిపిలలో శనివారం గేట్ మీటింగ్ లు నిర్వహించారు. జేవిఆర్ ఓసీపీ లో ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షులు ధారా భీమయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐటియూసి ఉపాధ్యక్షులు దారా భీమయ్య, భరణి పాల్గొని మాట్లాడుతూ ఏఐటీయూసీ గుర్తింపు సంఘం పత్రం అందుకున్న సంవత్సర కాలంలో డైరెక్టర్ పా స్థాయి సక్సెస్ సమావేశాలు రెండు జరగ్గా సి అండ్ అండి స్థాయి లో ఒక సమావేశం జరిగిందని, ఇట్టి సమావేశాల్లో ఒప్పుకున్నటువంటి అంశాలకు సంబంధించి సర్క్యులర్లు ఇవ్వకుండా, అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని, ఎన్ మైనస్, వన్ ప్లస్ డేల విషయంలో యాజమాన్యానికి నయా పైసా నష్టం లేనప్పటికీ దానిపై నిర్ణయం తీసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం జరగాల్సిన సి అండ్ ఎండి స్థాయి స్ట్రక్చర్ సమావేశాన్ని ఏఐటియూసి నాయకులు బహిష్కరించారు. కార్మికులు ఐక్య ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జి వీరస్వామి, సత్తుపల్లి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ సుధాకర్, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి సూర్యప్రకాశరావు, పిట్ కార్యదర్శి జి నరసింహారావు, కిష్టారం ఓసీలో పిట్ కార్యదర్శి కిషోర్, డి నరసింహారావు, సుధాకర్, వీరభద్రు, ఉపేంద్ర చారి, శేఖర్, జయరాజు, నరేందర్, బాలసుబ్రమణ్యం, సురేష్, శ్రీనివాసరావు, రాజశేఖర్ రెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు

## ఇళ్లకు మరమ్మతులు చేయించాలి



ప్రజాపక్షం/సత్తుపల్లి: మున్సిపాలిటీ పరిధి లోని ద్వారకాపురి కాలనీలో సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్ వల్ల నష్టపోయిన ఇళ్లకు మరమ్మ త్తులు చేయించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. కాలనీ వాసులతో కలిసి జేవిఆర్ ఓసి పిఓ ప్రహ్లాద్ కు శనివారం వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా దండు ఆదినారాయణ మాట్లాడుతూ సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్ కారణంగా సత్తుపల్లి ప్రాంతంలో ఎక్కడ చూసిన ఇంటి గోడలు పగుళ్ళు రావటం, రేకులు పగిలిపోయి నివాసముండే వారికి ఇబ్బంది మారుతున్నాయని, సింగరేణి యాజమాన్యం జోక్యం చేసుకొని దెబ్బతిన ఇళ్ళకు మరమ్మత్తులు చేయాలని కోరారు. స్పందించిన పిఓ ప్రహ్లాద్ దెబ్బతిన్న ఇళ్ళను పరిశీలన చేస్తామని అనంతరం జిఎంతో మాట్లాడి మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్వారకాపురి కాలనీ శాఖ కార్యదర్శి ఎర్రజల రాజశేఖర్, టౌన్ సహాయ కార్యదర్శి పాలకుర్తి వీరయ్య, మాతిపోగు సీమోను, రమేష్, మంద నాగరాజ్, తాళ్లూరు రమేష్, మాణిక్యం తులసి, సూరయ్య, సత్య వతి, అరుణ, రమాదేవి, వెంకటేశ్వరరావు, రాంబాబు, రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలి

### నమూనా బ్యాలెట్ ద్వారా కార్మికుల అభిప్రాయ సేకరణ



ప్రజాపక్షం/సత్తుపల్లి: సింగరేణి కార్మికులకు సొంత ఇంటి కల పథకం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని కోరుతూ శనివారం సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సత్తుపల్లి బ్రాంచ్ నాయకులు ముత్యాల కార్తీక్, గాదే సంపత్ ఆధ్వర్యంలో కార్మికుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని సింగరేణి వ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ప్రతి వ్యక్తికి సొంత ఇల్లు అనేది ఒక కల అని ప్రతి ఒక్క కార్మికుడికి రిటైర్మెంట్ తర్వాత సొంత ఇల్లు ఉండటం లేదని, పదవి ఉన్నంతవరకు ఎంతో గౌరవంగా ఉన్నటు వంటి కార్మికులు పదవి విరమణ తర్వాత కూడా అదే విధంగా ఉండాలని సొంత ఇల్లు కట్టుకోవడానికి రిటైర్మెంట్ తర్వాత వచ్చే బెనిఫిట్స్ సరిపోక చాలా ఇబ్బందులు పడుతున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో జేవిఆర్, కిష్టారం ఓసి నాయకులు మంగరాజు, దుర్గాప్రసాద్, సుధాకర్, మాచర్ల స్ఫూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాతీయ లోక్ అదాలత్‌లో 732 కేసులు పరిష్కారం



ప్రజాపక్షం/ మధిర : మధిర కోర్టు ప్రాంగ ణంలో శనివారం జరిగిన మెగా జాతీయ లోక్ అదాలత్‌లో 732 కేసులు పరిష్కారమయ్యా యని మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ ఎన్.ప్రశాంతి తెలిపారు. రెండు బెం చీలు ఏర్పాటు చేసి లోక్‌అదాలత్‌లో భాగంగా మామ కోడలైన లంక వెంకటేశ్వర్లు, లంక రాధ మధ్య భూ తగాదని పరిష్కరించి అవార్డు కాపీ అందచేయటం జరిగింది. ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు 428 కేసులు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 299 కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ జడ్జి ప్రశాంతి మాట్లాడుతూ కక్షి దారులు తమ సమయాన్ని ధనాన్ని వృధా చేసుకోకుండా రాజీ పడదగినటువంటి కేసులు రాజీ పడాలని, రాజీ మార్గమే రాజ మార్గమని అన్నారు. జాతీయ మెగా లోక్ అదాలత్ మూడునెలలకోసారి జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ లోక్‌అదాలత్‌ను ఉపయోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి, సెకండ్ క్లాస్ మేజి స్ట్రేట్ అబ్రహం, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జున్ను భద్రయ్య, బార్ అధ్యక్షులు బి.పుల్లా రావు, మధిర టౌన్, రూరల్, ఎర్రుపాలెం ఎస్సైలు, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పిఎల్వీలు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/పెనుబల్లి: పెనుబల్లి మండల పరిధిలో గల సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు 98 లక్షల 55 వేల, కళ్యాణ లక్ష్మి 34 లక్షల మూడు వేల తొమ్మిది వందల నలభై నాలుగు రూపాయల విలువ గల చెక్కులను శనివారం సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. చెక్కుల పంపిణీ అనంతరం ఎమ్మెల్యే రాగమయి తెలంగాణ రాష్ట్ర ఇంది రమ్మ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు, కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సబ్ డివిజన్ కలెక్టర్ అజయ్ యాదవ్ తహశీల్దార్, ఎంపీడీవో, ప్రభుత్వ అధికారులతో పాటు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ, వైస్ చైర్మన్ కోటేశ్వరరావు నీలాద్రి చైర్మన్ చిన్న నరసింహారావు, పెను బల్లి మండల అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు, ఖమ్మం జిల్లా అధికార ప్రతినిధి పొట్లపల్లి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు వంకాయలపాటి వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి, సీతారాములు, చిన్న స్వామి, చీకటి రామారావు, మాధవరెడ్డి, బుర్ర కోటేశ్వరరావు, పెను బల్లి మండల గ్రామాల పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాటం బావితరాలకు ఆదర్శం

### -సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం



ప్రజాపక్షం/బోనకల్: నైజాం రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన తెలం గాణ రైతాంగ సాయుధ పోరాటం భావితరాలకు ఆదర్శమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. మండలం లోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో సాయుధ పోరాట అమరుల స్థూపాల వద్ద హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డిలు శనివారం నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉవ్వెత్తున జరి గిందని తెలిపారు. రజాకార్లకు వ్యతిరేకంగా ఆయుధాలు పట్టి పోరా డిన చరిత్ర ఇక్కడి యోధులకు ఉందని అన్నారు. నాడు ప్రతి పల్లెలో రజాకార్లను వ్యతిరేకించి ప్రాణాలు కోల్పోయారని, వారికి గుర్తుగా నేడు స్థూపాలు నిలుస్తాయని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం సాయుధ తెలంగాణ పోరాట చరిత్రను వక్రీకరిస్తోందని ఆయన ఆరో పించారు. సాయుధ పోరాటంతో ప్రతి గ్రామానికి ప్రత్యక్షంగా, పరోక్షం సంబంధం ఉందని, ఆ పోరాట ఫలితంగానే 10 వేల ఎకరాల భూమిని పేదలకు పంచారని, 3 వేల గ్రామ రాజ్యాలు ఏర్పడ్డాయని, వెట్టిచాకిరి రద్దయిదని, జమీందారలను గ్రామాల నుండి తరిమికొట్టా రని అన్నారు. ప్రత్యేకమైన ఉద్యమ ప్రాంతమైన గోవిందాపురంకు ఘన మైన చరిత్ర కలిగి ఉందని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని నేటి తరానికి తెలిపేందుకే వారోత్సవాలను నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సహాయ కార్యదర్శి జక్కుల రామారావు, వల్లకొండ బ్రహ్మం, కొత్తపల్లి రమేష్, తమ్మారపు లక్ష్మణరావు, తమ్మారపు బ్రహ్మయ్య, కొత్తపల్లి కృష్ణ గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్‌యార్డ్‌కు స్థలాన్ని పరిశీలించండి

### -అదనపు కలెక్టర్ శ్రీజ
### -డంపింగ్‌యార్డ్ ఏర్పాటుపై మంత్రి పొంగులేటి ప్రత్యేక దృష్టి






ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీలో మున్సిపాల్ ప్రత్యేక అధికారి శ్రీజ పర్యటించారు. వైరా మున్సిపాలిటీకి డంపింగ్‌యార్డ్ పరిష్కారం ఎప్పుడు మున్సిపాలిటీలో సమస్యగా మారిన డంపింగ్‌యార్డ్ ఏర్పాటనే వరుస కథనాలను ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురించడం జరిగింది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వైరా మున్సిపాలిటీ పరిధిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సాధించడంతో పాటు మున్సిపాల్ కమీ షనర్‌ను డపింగ్ యార్డ్ వివరాలనుఅ డిగి తెలుసుకున్నట్లు సమాచారం. వైరా మున్సిపాలిటీకి సమస్యగా మారిన డంపింగ్‌యార్డ్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించాలని అదనపు కలెక్టర్ శ్రీజ అధికారులను శుక్ర వారం ఆదేశించారు. వైరాలో డంపింగ్‌యార్డ్ ఏర్పాటు కోసం పలుచోట్ల స్థలాలను పరిశీలించిన శ్రీజ మాట్లాడుతూ డంపింగ్‌యార్డ్ ఏర్పాటు ముసలిమడుగు వద్ద కుదరదు. అక్కడ విద్యార్థులు చదువుకుంటు న్నారు. వాహనాలు పోవడానికి ఇబ్బందికరంగా ఉంటుంది అని తెలి పారు. వైరాలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని తహశీల్దార్ శ్రీనివాస రావు ఆదేశించారు. నక్ష ఆధారంగా చేసుకొని ఎక్కడ ప్రభుత్వ భూమి ఉందో వాహనాలు పోవడానికి అనుకూలంగా ఉంటుందో అలాంటి స్థలాన్ని గుర్తించాలని ఆదేశించారు. ప్రజాపక్షం కథనానికి స్పందించిన అధికారులు పూర్తిస్థాయిలో వైరాలో మున్సిపాలిటీ పరిధిలో డంపింగ్ యార్డ్ చాలా అవసరమని దానికి స్థలం సేకరణ త్వరగా పూర్తిచేయా లని అదనపు కలెక్టర్ శ్రీజ ప్రత్యేకంగా రంగంలోకి దిగారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాసరావుతో మాట్లాడుతూ త్వరగా ప్రభుత్వ భూమిని గుర్తించి మున్సిపాలిటీకి డంపింగ్‌యార్డ్ కేటాయించే విధంగా చర్యలు చేపట్టి పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఈ కార్య క్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడివో సక్రియ, మున్సిపాల్ కమీషనర్ గురులింగం, శానిటేషన్ అధికారి వీరన్న, పలువురు అధికా రులు పాల్గొన్నారు.

## ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి



ప్రజాపక్షం/కారేపల్లి: గిరిజన పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మి కులు జీతాలు రూ 15,600 చెల్లించాలని, 60 జీవోని అమలు చేయాలని తదితర డిమాండ్ల మీద ఖమ్మం జిల్లాలో రెండు రోజుల నుండి సమ్మె ప్రారంభించారు. కాగా శనివారం కారే పల్లి మండలంలో మేకల తండా శాంతినగర్‌లోని గిరిజన పోస్ట్ మెట్రిక్ హాస్టల్ సమ్మె బాట పట్టారు. ఈ సమ్మెకు మద్దతుగా కారేపల్లి, కామేపల్లి టియుసిఐ ఏరియా కమిటీ మద్దతు తెలిపింది. ఈసందర్భంగా టియు సిఐ కారేపల్లి కామేపల్లి ఏరియా అధ్యక్షులు జోగా నాగేశ్వరరావు, కార్య దర్శి ధారావత్ సక్రులు మాట్లాడుతూ అధి కారుల యొక్క నిర్లక్ష్యం వల్లన కార్మికులు సమ్మె చేస్తున్నారని, రూ 15,600 జీవం ఇచ్చిన అధికారులు 2020 వరకు ఇచ్చి, ఇప్పుడు తగ్గించడం విడ్డూరంగా ఉంద న్నారు. కార్మిక వర్గం న్యాయమైన డిమాం డ్లను అధికారులు పట్టించుకోకపోతే కార్మికుల తరపున పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని అధికారులకు తెలిపారు. అదే విధంగా డిమాండ్లు పరిష్కారం అయ్యేంత వరకు కార్మికుల ఐక్యంగా ఉద్యమిం చాలని కోరారు.

## హాస్టల్ డైలీ వేజ్ వర్కర్ సమస్యలు పరిష్కరించాలి




ప్రజాపక్షం/కారేపల్లి: తమ సమస్యలు పరి ష్కరించాలని గత రెండు రోజులుగా సమ్మె చేస్తున్న హాస్టల్ డైలీ వేజ్ వర్కర్స్ సమస్య లపై ప్రభు త్వం వెంటనే స్పందించి పరిష్క రించాలని సిఐటియు సింగరేణి మండల కన్వీనర్ కే నరేంద్ర డిమాండ్ చేశారు. శని వారం మండలంలో శాంతినగర్, మేకల తండా ఆశ్రమ పాఠశాలలు, కారేపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ కళాశాలల గర్ల్స్ హాస్టల్స్ వద్ద సమ్మె చేస్తున్న సమ్మె కేంద్రాలను కే నరేంద్ర సందర్శించి సమ్మెలో పాల్గొం టున్న హాస్టల్ డైలీవేజ్ వర్కర్స్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా అవుట్సోర్సింగ్‌లో హాస్టల్ డైలీ వేజ్ వర్కర్స్‌గా పని చేస్తున్న కార్మికులకు పర్మినెంట్ కానీ, టైం స్కేల్ అమలు జరపడం గాని, ఇన్సూరెన్స్ సౌకర్యం గాని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి సౌకర్యాలు ఏమి లేకుండా గిరిజనులకే ప్రత్యేకమైన చట్టాలు ఉన్నప్పటికీ ఇవేమీ అమలు జరగడం లేదని కనీసం కార్మిక చట్టాల ప్రకారమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించడం లేదని ఈ కారణంగా ఈ విద్యా సంవత్సరం ఇంత వరకు వేతనాలు చెల్లించలేదని విమర్శించారు. ఈసమ్మెలో యూని యన్ నాయకులు బొమ్మల అనంతరాములు, నందియా, మాతృ, సారంగి, పద్మ, సరస్వతి, కళావతి, లక్ష్మీ , తదితరులు పాల్గొన్నారు.

# అమర వీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

### -భూమి, భుక్తి, విముక్తి కోసమే సాయుధ పోరాటం



ప్రజాపక్షం/చర్ల : అమర వీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ నిర్మాణాలకు నడుం బిగించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల్లో భాగంగా శని వారం చర్లలో జరిగిన వార్షికోత్సవ సభలో కల్లూరు మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టులు సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారన్నారు. తెలంగాణ పల్లెల్లో ఘోర మైన అణిచివేత ఉండేదని ప్రజలు బానిసల్లా బతకాల్సిన పరిస్థితుల్లో సాయుధ పోరాటం చేపట్టాల్సి వచ్చిందన్నారు. ప్రపంచంలోనే ధనవం తుడిగా చెప్పుకునే నైజాం రాజును గద్దె దించి తెలంగాణలో ప్రజారా జ్యాన్ని స్థాపించిన ఘనత కమ్యూనిస్టులకే దక్కుతుందన్నారు. పోరాట ఫలితంగానే తెలంగాణలో రాచరిక పాలన రద్దయిందని ఈ పోరా టంలో నాలుగున్నర వేల మంది అమరులయ్యారని కల్లూరు తెలిపారు. పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచడంతో పాటు సాయుధ పోరాటం భూమి విలువను ప్రపంచానికి తెలిపిందని ఆయన తెలిపారు. అమరుల ఆశయ సాధనలో ముందుకు సాగాలని ఆయన పిలుపుని చ్చారు. మండల కార్యదర్శి నూపా పోతయ్య అధ్యక్షతన జరిగిన సమా వేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అడగర్ల తాతాజీ, సీనియర్ నాయకు లు నూపా తిరుపతిరావు, పాల్వంచ రామారావు, కోటి ముత్యాలరావు, చల్లా లక్ష్మి నారాయణ, పాలెం సత్యనారాయణ, కోడిరెక్కల రాజారావు, కొవ్వాసి దేవయ్య, భీమయ్య, నందయ్య, మురళి పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన కాంగ్రెస్ జెండా ఎగరాలి

### ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



ప్రజాపక్షం/పినపాక: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని పినపాక శాసనస భ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని చేగ ర్శల గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ నుండి 110 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లా డుతూ ప్రజలు ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకా లకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని తెలిపారు. అధి కారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రుణ మాఫీ, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించిదని, గృహాలకు రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, గ్యాస్ సిలిండర్ పై 500 రూపాయల సబ్సిడీ ఇస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ఇంది రమ్మ ఇండ్లు అని, ఇప్పటికే పినపాక నియోజకవర్గంలో 4500 ఇంది రమ్మ ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి కోసం కోట్లాది రూపాయల నిధులతో రహదారులు, బ్రిడ్జిలు నిర్మిస్తున్నా మని తెలిపారు. మహిళకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తున్నామని, ప్రతి మహిళను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుం దని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్నదని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పదేల్ల పాలనలో ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చార న్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలు, అభి వృద్ధి పనులు చేపడతామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు కాంగ్రెస్ పార్టీని అఖండ మెజారిటీతో గెలిపి స్తారని, గ్రామ గ్రామాన కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొడిశాల రామనాథం, మాజీ వైస్ ఎంపిపి కంది సుబ్బారెడ్డి, ఉడుముల లక్ష్మీ రెడ్డి, పేరం వెంకటేశ్వర్లు, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి , కొర్సా ఆనంద్, గుడిబండ మధుసూదన్ రెడ్డి, బోడ రమేష్, పరిమి వెంక టేశ్వరరావు, బండారు సాంబశివరావు, మల్లయ్య, కాంగ్రెస్ నాయ కులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వెదురు తడికల మాఫియా..!

### కూలీలకు రూ.200 ఇచ్చి, మార్కెట్‌లో రూ.450 మనీ కి అమ్ముతాడట





ప్రజాపక్షం/సత్తుపల్లి: సత్తుపల్లి మండ లంలో వెదురు తడికల మాఫి యా రాజ్యమే లుతుంది. ప్రతిరోజు వందల సంఖ్యలో వెదురు తడికలు చీకటి మాటున పల్లెలను దాటి పట్టణాల్లోకి ప్రవేశిస్తున్నాయి. పట్టప గలే అందరూ చూస్తుండగానే వెదురు బొంగులను అడవుల నుండి అక్రమంగా నరికి మారుమూల పల్లెకు చేర్చి, తడికలు అల్లి సొమ్ము చేసుకుంటుంది మాఫియా. వేల సంఖ్యలో వెదురు బొంగులు అడవు నుండి అక్రమంగా తరలిపోతున్న అటవీ శాఖ అధికారులు మాత్రం మౌనంగా ఉంటున్నారు. ఈ మనీ మాటున వ్యవహారం ఇప్పుడు పట్టణంలో పెద్ద చర్చాంశనీయంగా మారింది. వివరాలు తెలియాలంటే ఈ కథనం చద వండి మరి.. సత్తుపల్లి మండలం రేగళ్ళపాడు గ్రామం ఇప్పుడు అక్రమ తడికల వ్యాపారానికి కేంద్ర బిందువుగా మారింది. గ్రామంలోని వారికి ఈ వ్యాపారం కుటీర పరిశ్రమగా మారింది. వెదురు బొంగులు నరికే దగ్గర నుండి, తడికలుగా మారి పల్లెల నుండి పట్టణాలకు చేర్చే తతంగా అంతా మనీ ద్వారానే జరుగుతుందని ఆ గ్రామంలోని వారే చెప్పుతుం డడం విశేషం. ఈ అక్రమ దోపిడీలో స్థానిక కూలీలకు కేవలం మనీ ఇచ్చేది కూలీ అంతే అని, మాఫియాకు దక్కే మని మాత్రం భారీగానే ఉంటున్నట్లు తెలుస్తుంది. గ్రామంలో కష్టపడి అల్లిన ఒక్కో తడికను మాఫియా రూ.200లకు కొని, పక్క రాష్ట్రానికి రూ.600కు విక్రయి స్తుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మనీ చెప్పిందే వేదంగా భావించే కొందరు అధికారులు ఈ అక్రమ వ్యాపారానికి పూర్తి సహాయ, సహకారాలు అందిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ అక్రమ తడికల వ్యాపా రంలో మనీ నే కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. రాత్రి, పగలు తేడా లేకుండా అడవులలోకి చొరబడి వెదురు చెట్లను నరికి, వాటిని ఆంధ్ర సరిహద్దుల వరకు తరలిస్తున్నట్లు గ్రామస్థులు బాహటంగానే చెబుతున్నారు. మాఫియా అక్రమ కార్యకలాపాలకు ఫారెస్ట్ అధికా రులు మద్దతు ఇస్తున్నారని, వారి కనుసన్నలోనే ఈ దందా యధేచ్ఛగా సాగుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల మౌనంపై ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అడవులను రక్షించా ల్సిన ఫారెస్ట్ సిబ్బందే మనీ మద్దతిచ్చి మౌనంగా ఉంటున్నారని వెదురు తడికెలు అల్లే వారే చెబుతుంటే విస్మయం కలిగించింది. ఈ వెదురు తడి కెల మాఫియా చెప్పిందే వేదంగా భావిస్తున్న అధికారులు, ప్రభుత్వ లక్ష్యాలను నీరు గార్చుతున్నారని పర్యావరణ ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అడవులను రక్షించాల్సిన అధికారులు మనీ ని జేబులో పెట్టుకుని మద్దతివ్వటమేమిటని అటవీ ప్రేమికులు ముక్కున అటవీ సంపద దోపిడీ ఇలాగే కొనసాగితే తీవ్ర పరిణామాలు ఎదురవు తాయని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రేగళ్ళపాడు కేంద్రం గా సాగుతున్న ఈ అక్రమ వెదురు తడికెల మాఫియాపై జిల్లా అధికా రులు దృష్టి సారించి, కింది స్థాయిలో మనీ చెప్పింది చేస్తున్న సిబ్బంది, అధికారులపై చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు జిల్లా ఫారెస్ట్ అధికారి, చీఫ్ కన్జర్వేటర్ లను కోరుతున్నారు. త్వరలోనే పూర్తి సమాచారంతో డిఎఫ్ఓ ని కలిసి అక్రమ వెదురు తడికల వ్యాపారం, వారికి సహకరిస్తున్న అధికారుల పేర్లతో సహా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామని పర్యావరణ ప్రేమికులు, ప్రజా సంఘాల నాయ కులు తెలుపుతున్నారు.

## పేరుకుపోయిన చెత్తను తొలగించండి



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మున్సిపాలిటీ కార్యాలయం ప్రక్కనే ఉన్న డ్రైనేజీలో చెత్తా చెదారం పేరుకుపోయిందని స్థానికులు మండిపడుతున్నారు. చిన్న పాటి వర్షానికే వరద నీరు ఇండ్ల లోకి చేరుతుందని, మున్సిపాలిటీ కార్యాలయం ప్రక్కన ఉన్న డ్రైనే జిని మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీ, గ్రామాల్లో ఉన్న మురుగు కాల్వలు, డ్రైనేజీల ను పట్టించుకుంటారని నమ్మకం ఏమి టని స్థానికులు మండి పడుతున్నారు. మున్సిపాలిటీ కమిషనర్ కార్యాలయం ప్రక్కనే ఉన్న డ్రైనేజిని పరిశీలించి, పేరుకుపోయిన చెత్త ను తొలిగించి, ఇండ్లలోకి వర్షపునీరు రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం



ప్రజాపక్షం/కరకగూడెం: అభివృద్ధి, సంక్షేమం మార్గంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రజా సంక్షే మమే కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. శనివారం కరకగూడెం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు అభివృద్ధి ప్రదాత పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథి పాల్గొన్న టీపీసీసీ సభ్యులు డాక్టర్ చందా సంతోష్ కుమార్‌తో కలిసి ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల చేత ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ప్రతి వర్గానికి సంక్షేమం, అభివృద్ధి అందించడానికి కృషి చేస్తుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వ లక్ష్యం కేవలం అధికారంలో ఉండటం కాదు ప్రజల జీవిత ప్రమాణాలను మెరుగుపరచడం అని అన్నారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో అందరూ కలిసికట్టుగా పనిచేసి విజయం సాధించాలని పిలుపునిచ్చారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి విశ్వాసం చూపి గెలిపిస్తే గ్రామాలు, పట్టణాలు మరింత అభివృద్ధి దిశగా పయనిస్తాయని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లోమాజీ ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, సీని యర్ నాయకులు, యువజన నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక లారీ, జెసిబి స్వాధీనం, కేసు నమోదు



ప్రజాపక్షం/అశ్వాపురం: జగ్గారం గ్రామం లో అక్రమంగా ఇసుకను స్టాక్ ఏర్పాటు చేసి అందులో నుండి ఇసుకను ఇల్లందుకు తరలిస్తున్న ఇసుక లారీ, దానికి సహాయప డిన జెసిబిని సీజ్ చేయడం జరిగిందని సిఐ అశోక్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేసులో మంచి కంటినగర్‌కు చెందిన ఊకే సతీష్, ఇల్లందుకు చెందిన లారీ డ్రైవర్ భూక్య జానీ, జెసిబి ఓనర్ పరుచూరి రాకేష్‌లపై కేసు నమోదు చేశామని తెలిపారు.

## రైతుల రాస్తారోకో



ప్రజాపక్షం/అశ్వాపురం: తుమ్మల చెరువు శెట్ట ర్‌లు వెంటనే లేపాలని ఆందోళన చేస్తూ మొండి కుంట ప్రధాన రహదారిపై శనివారం రైతులు రాస్తారోకో చేశారు. ట్రాఫిక్ భారీగా జామ్ కావ డంతో అశ్వాపురం సిఐ అశోక్‌రెడ్డి రైతులతో మాట్లాడినప్పటికి, రైతులు నీటిపారుదల శాఖ అధికారులు వచ్చి సమస్య పరిష్కరిస్తే తప్ప కదలమని బైఠాయించడంతో డిఈ రమేష్ బాబు వచ్చి పరిష్కారం అయ్యే అన్ని ప్రయ త్నాలు చేస్తామని, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విర మించారు. ఈకార్యక్రమంలో రైతులు మర్రి మల్లారెడ్డి, కోడి అమరేందర్, తూము చిన్న రాఘవులు, బద్దం శంబిరెడ్డి, వెంకటరెడ్డి, మంద్రు రామకృష్ణ, కోటేశ్వరరావు, తదితర రైతులు పాల్గొన్నారు.

## నేడు లంబాడీల ఆత్మగౌరవ ర్యాలీ



ప్రజాపక్షం/జూలూరుపాడు:14న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరగబోయే లంబాడీలు ఆత్మ గౌరవ ర్యాలీని విజయ వంతం చేయాలని బంజారా నాయకులు పిలు పునిచ్చారు. శనివారం జూలూరుపాడు మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో నాయ కులు మాట్లాడుతూ కొంత మంది ఎంఎల్ఏలు లంబాడీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా అసత్య ఆరోపణలు చేస్తున్నారని, సుప్రీం కోర్టులో లంబాడీలపై దాఖలైన కేసుకు వ్యతిరేకంగా ఈ నెల 14న ఛలో భద్రాద్రి కొత్తగూడెం ప్రదర్శనకు హాజరు కాగలరని, లంబాడీలు రాజ్యాంగ బద్ధంగా షెడ్యూల్ తెగలుగా గుర్తించబడ్డారని, అయినప్పటికీ అన్న దమ్ములుగా ఉన్న గిరిజన తెగల మధ్య ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తూ కొందరు రాజ కీయ లాభం కోసం ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరగ బోయే ఆత్మగౌరవ ర్యాలీని జయప్రదం చేయాలని మన జిల్లా లంబాడీ నాయకులు తండో పతండాలుగా తరలి రావాలని పిలుపునిచ్చారు.

# నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు చేయూత

## -ట్రస్ట్ సేవలు అభినందనీయం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు చేయూతనందిస్తున్న పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ సేవలను వ్యవసాయ శాఖ విశ్రాంత ఏడి పి. కోటేశ్వరరావు, కూసుమంచి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రరావు ప్రశంసించారు. శనివారం కృషిభవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేరళ సెంట్రల్ యూనివర్సిటీలో చదువుతున్న వైరాకు చెందిన నిరుపేద విద్యార్థి బసవోజు మనోజ్‌కు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ రూ. 20వేల చెక్కును కూసుమంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి. వీరభద్రరావు అందజేశారు. ఖమ్మం వైఎస్ఆర్ కాలనీకి చెందిన నిరుపేద విద్యార్థి తాటికొండ సోమశేఖర్‌కు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు చేయుతగా సమకూర్చిన రూ. 20వేల చెక్కును వ్యవసాయ శాఖ విశ్రాంత ఏడి పుట్టగుంట కోటేశ్వరరావు అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో సమయపాలన పాటిస్తూ విద్యలో మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ట్రస్ట్ ఛైర్మన్ పరిశ పుల్లయ్య, సభ్యు లు మహంకాళి స్వరాజ్యలక్ష్మి, పరిశ లక్ష్మి రాజ్యం లు విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిపిఏటి కోశాధికారి గుర్రాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఊడుగు వెంకటేశ్వరరావు, సీనియర్ పెన్షనర్లు సత్యనారాయణరావు, సుబ్బారావు, నారాయణరావు, పుల్లయ్య, నాగేశ్వరరావు, మురళికృష్ణ, మధు బాబు, ఉమాసుందరి పాల్గొన్నారు.

# హార్వెస్ట్‌లో విద్యార్థి నాయకుల ప్రమాణస్వీకారోత్సవం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో జరిగిన నమూనా ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థుల ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రముఖ సివిల్ సర్జన్ డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్, కరస్పాండెంట్ పి. రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్. పార్వతిరెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ ఎంతో ఉత్సాహపూరిత వాతావరణంలో విద్యార్థి నాయకులకు జరుగుతున్న ప్రమాణస్వీకార మహోత్సవం మరింత ఉత్సాహాన్ని నింపేదిగా ఉందన్నారు. ఆసక్తి రేకెత్తించేవిధంగా ఎన్నుకున్న ఈనాటి ఈ విద్యార్థి నాయకులే రేపటి నాయకులు కాబట్టి నాయకుడు అంటే ఎలా ఉండాలి, నాయకత్వ లక్షణాలు ఎలా పెంపొందించుకోవాలని అనే విషయాన్ని గెలుపొందిన విద్యార్థులకు తెలియజేశారు. మన హక్కుల పట్ల బాధ్యతల పట్ల అవగాహన కలిగి ఉండాలని, సామాజిక అంశాల పట్ల జాగరూకతతో ఉండాలన్నారు. ఇతరులతో కలుపుగోలుతనం గల వ్యక్తులు నాయకులుగా ఉన్న సమాజం అభివృద్ధి సాధిస్తుందన్నారు. అనంతరం ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులను సీనియర్ బాలికల ప్రతినిధి కె. దేవిదీత్య , సీనియర్ బాలుర ప్రతినిధిగా శశాంక్ యాదవ్, జూనియర్ బాలికల ప్రతినిధిగా పి. శ్రీయ ముకుంద, జూనియర్ బాలుర ప్రతినిధిగా సిహెచ్ భార్గవ్ లతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమ నిర్వాహకులుగా ఎన్నుకోబడిన అభ్యర్థులచే కూడా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, సోషల్ డిపార్ట్‌మెంట్ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్ కమ్యూనిస్టులదే.. : పోతినేని



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను బిజెపి వక్రీకరిస్తూ ముస్లిం హిందూ పోరాటంగా చిత్రీకరిస్తుందని, రాబోయే భవిష్యత్ కమ్యూనిస్టులదే అని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల భాగంగా సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి, సామినేని రామారావు 17వ వర్ధంతి సందర్భంగా ఎర్రుపాలెం మండల పరిధిలోని భీమవరం గ్రామంలో సభను ఏర్పాటు చేశారు. తొలుత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులకు నివాళులర్పించారు. అనంతం సిపిఎం పార్టీ పతాకాన్ని మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ ఆవిష్కరించారు. సీతారాం ఏచూరి, సామినేని రామారావు, చాకలి ఐలమ్మ చిత్రపటాలకు పోతినేని సుదర్శన్‌రావు, దివ్వెల వీరయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గొల్లపూడి పెద్ద కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో పోతినేని మాట్లాడుతూ భారతీయ రాజకీయాల్లో పెనుమార్పులు చోటు చేసుకుంటున్న పరిస్థితుల్లో అభ్యుదయ లౌకిక ప్రజాస్వామ్య శక్తుల పాత్రను ముందుకు నడిపించేందుకు ఏచూరి లేని లోటు కొట్ట వచ్చినట్లుగా కన్పిస్తుందని అన్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడటమే సీతారాంకు మనమిచ్చే ఘనమైన నివాళి అన్నారు. భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని తెలిపారు. రాచరిక వ్యవస్థ, భూస్వామయ్య దోపిడిపై ఎదురొడ్డి పోరాడిన చరిత్ర తెలంగాణ సాయుధ పోరాటమని, ఈ పోరాటంలో హిందువులే కాకుండా ముస్లింలు పాల్గొన్నారని తెలిపారు. ఈ చారిత్రక పోరాటాన్ని వక్రీకరిస్తూ బిజెపి చేస్తున్న విషప్రచారాన్ని తిప్పి కొట్టేందుకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తున్న తెలిపారు. ఏచూరి భావజాలాన్ని ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు నల్లబోతు హన్మంతరావు, గామాసు జోగయ్య, నాగులవంచ వెంకటరామయ్య, షేక్.లాలా, మేడగాని తిరుపతిరావు, సగుర్తి సంజీవరావు, కన్నెబోయిన శ్రీను, మండడపు ప్రభాకర్, కూడేలి నాగేశ్వరరావు, తాళ్లూరి వెంకటనారాయణ, దివ్వెల వీరాంజనేయులు, అనుమోలు అనీల్, సామినేని సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 317 కేసులు పరిష్కారం



**ప్రజాపక్షం/మణుగూరు:** జాతీయ లోక్‌ఆదాలత్ భాగంగా మణుగూరు కోర్టు లో ఎస్‌టిసిఎన్‌ఐ యాక్స్ కేసులు 1 సిసి కేసు, 26 ఎస్‌టిసి కేసులు 213 సిసి ఎక్సైజ్, 10 బ్యాంక్ పిఎల్‌సి, 41 బిఎస్‌ఎన్‌ఎల్ పిఎల్‌సి 26 మొత్తం 317 కేసులు పరిష్కరించినట్లు మేజిస్ట్రేట్ కంభపు సూరిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మెజిస్ట్రేట్ మాట్లాడుతూ రాజీ మార్గం రాజ మార్గం, రాజీ పడదగిన కేసుల్లో రాజీ చేసుకొని వారి యొక్క సమయాన్ని కుటుంబ అభివృద్ధికై సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చెక్కు కేసుల్లో కూడా వాది, ప్రతివాదులు ఇరువురు కలిసి రాజీ చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బద్దం శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లావణ్య, డీఎస్పీ రవీందర్ రెడ్డి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అంకం సర్వేశ్వరరావు, లోక్ అదాలత్ మెంబర్ కె వీర మధుసూదన్, లీగల్ ఎయిడ్ మెంబర్ పోశం భాస్కర్, న్యాయవాదులు, మణుగూరు సి ఐ నాగబాబు, ఏడూళ్ళ బయ్యారం సి ఐ వెంకటేశ్వర్లు, బ్యాంకర్లు, పోలీస్ సిబ్బంది, కక్షిదార్లు పాల్గొన్నారు.

# టిఎన్‌జివో నూతన అధ్యక్షునిగా సుధాకర్



**ప్రజాపక్షం/వైరా:** టిఎన్‌జివో నూతనంగా ఖమ్మం జిల్లా మున్సిపాల్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఏ.సుధాకర్, సెక్రటరీ జి.శ్రీనివాసరావు, ఖమ్మం జిల్లా యూనియన్ సభ్యులు అందరూ కలిసి టిజివోస్ రాష్ట్ర అధ్యక్షులు, టిజిఈజేఏసి సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనన్నను నూతనంగా బాడీ ఎన్నికైన సందర్భంగా పలువురు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# సర్వజ్ఞలో హిందీ దివస్ వేడుకలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాలలో హిందీ దివస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో హిందీ భాష పట్ల అవగాహన, ఆసక్తిని పెంపొందించేందుకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ ఆర్‌వి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ హిందీ దివస్ యొక్క ప్రాముఖ్యత, దాని విశిష్టతను విద్యార్థులకు వివరంగా తెలియజేశారు. హిందీ మన దేశానికి కేవలం ఒక భాష మాత్రమే కాదు అది మన జాతీయ ఐక్యతకు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అన్నారు. మహాత్మా గాంధీ వంటి మహనీయులు హిందీని దేశ రాజభాషగా చేయాలని గట్టిగా కోరారు. రాజ్యాంగంలోని అధికరణం 343(1) ప్రకారం దేవనాగరి లిపిలో ఉన్న హిందీని అధికార భాషగా గుర్తించారన్నారు. హిందీ నేర్చుకోవడం వల్ల జాతీయ ఐక్యత, సమన్వయం, ఉద్యోగ అవకాశాలు, సాంస్కృతిక అనుసంధానం, ప్రయాణం, జ్ఞానాభివృద్ధికి గల అవసరాలు, కారణాలు ఉన్నాయన్నారు. వక్తృత్వ, క్విజ్, వ్యాసరచన వంటి పలు విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ మొదటి సంవత్సరంలో దోస్త్ రిజిస్ట్రేషన్లకు ఆహ్వానం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని మద్దులపల్లిలోని ఎస్‌బిసిలో గల తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఖమ్మం నందు డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్ ప్రక్రియను విడుదల చేయడం జరిగిందని, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం సునీత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బిఎస్‌సి, ఎంపీసి, సిఏ, బికాం, బిఏ, బిఏహెచ్‌ఇపి కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని ఈనెల 15,16,18లోగా దోస్త్ రిజిస్ట్రేషన్స్ చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్ల జీరాక్స్, 8ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 7995010677, 8096408154 నెంబర్లను సంప్రదించాలన్నారు.

# జెఎన్‌టియు ఫలితాలలో ప్రియదర్శిని ప్రతిభ




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ప్రియ దర్శిని విద్యార్థినిలు జెఎన్‌టియు విడుదల చేసిన మొదటి సంవత్సరం రెండవ సెమిస్టర్ ఫలితాలలో ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో విద్యార్థినిలను చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి. గోపాల్, అకడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతులు అధ్యాపకులు, పాల్గొన్నారు.

# రాజీమార్గమే రాజ మార్గం




**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని శనివారం జరిగిన లోక్ అదాలత్ లో భాగంగా జరిగిన రాజి మార్గంలో జరిగిన కార్యక్రమంలో 20 డ్రంక్ అండ్ డ్రైవ్, 10 సాధారణ వివాదాలు, 15 దుర్భాషలాడటం, తోపులాట, వాగ్వివాదం లాంటి కేసులు మొత్తం 45 కేసులు పరిష్కారం జరిగినట్లు ఎస్సై హరిత తెలిపారు. ఈ విధంగా 45 మందికి ఇరువురు మధ్య రాజీ మార్గమే రాజమార్గమని, సమాజంలో శాంతియుతంగా జీవిస్తూ అందరికీ ఆదర్శంగా ఉండాలని, సమాజంలో ఒకరినొకరు అర్థం చేసుకుని విలువలతో కూడిన జీవితాన్ని స్నేహత్వంతో జీవించాలని చట్టానికి లోబడి ఉండాలని ఆమె వారికి అవగాహన కల్పిస్తూ రాజీ పరిచారు. మండల పరిధిలోని పలు గ్రామాల వారికి అవగాహన కార్యక్రమం జరిగింది.

# కుంగిన రహదారి.. ఆదమరిస్తే విరిగినట్లే



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని తెలగవరం, మర్లపాడు గ్రామాల మధ్య బిటి రహదారి కుంగిపోవడంతో ప్రమాదకరంగా మారి ఆదమరిసి వెళ్తే కాళ్లు చేతులు విరిగినట్లే. గత కొన్ని నెలలుగా ఈ రహదారి కుంగి ఉండడం వలన పెద్ద గుంత ఏర్పడి ప్రమాదానికి ఇరువురు గ్రామాల మధ్య గ్రామాల ప్రజలు ప్రమాదానికి గురవుతున్నారు. హెచ్చరికగా పెద్ద రాయి చెత్త వేసి ఉంచారు. తెలియని వారు కొత్తవారు అయితే ప్రమాదానికి గురవుతున్నారని అంటూ ఆయా గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. పంచాయతీరాజ్ అధికారులకు తెలియపరిచామని ప్రజలు తెలిపారు. ఈ విషయమై పిఆర్ డిఈని వివరణ కోరగా సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

